పల్లెల్లో సంక్రాంతి సందడి


వరదయ్యపాళెం మండలంలో సంచారం చేస్తున్న గంగిరెద్దుల కళాకారులు


పెద్ద పాండూరు ప్రాంతంలో భోగి కంపను తరలిస్తున్న చిన్నారులు

వరదయ్యపాళెం: సంక్రాంతి సంబరాలకు పల్లెలు సిద్ధమయ్యాయి. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసే వారంతా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఇళ్లకు రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేశారు. తొలుత వచ్చే భోగి పండుగకు మంటలు వేయడానికి చిన్నారుల నుంచి పెద్దల వరకు పోటాపోటీగా కంపను తరలించారు. సంక్రాంతి సెలవులు బుధవారం నుంచి మొదలవడంతో ఎక్కడ చూసినా పల్లెల్లో చిన్నారులు, యువకులు ఆటలతో సందడి చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి చలినీ లెక్క చేయక మహిళలు ఇళ్ల ముందు సంకాంత్రికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు తీర్చిదిద్దారు.

కళలకు ఆదరణ కరువు

కళల లోగిలిగా భావించే సంక్రాంతి పండుగ సమీపిస్తున్నా జానపద కళాకారుల జాడ కనిపించడం లేదు. గతంలో సంక్రాంతి వచ్చిందంటే ఇళ్ల ముందు గొబ్బెమ్మలు, రంగవల్లులు, హరిలో హరి అంటూ హరిదాసులు, అయ్యవారికి దండం పెట్టు..అమ్మవారికి దండం పెట్టు..అంటూ గంగిరెద్దులతో ఆటగాళ్ల చేయించే విన్యాసాలు, శంభో శంకరా అంటూ జంగందేవర్ల సందడి పల్లెల్లో కనిపించేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. తెలుగువారి అచ్చ తెలుగు పండుగ కళ తప్పుతోంది. జానపద కళలకు ఆదరణ తగ్గిపోయింది. దీంతో గంగిరెద్దుల వారు, హరిదాసులు, జంగందేవర్లు తదితర కళాకారులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్నారు. తరతరాలుగా చేస్తున్న వృత్తిపై మమకారం ఉన్నవారు అరుదుగా గ్రామాలు, పట్టణాల్లో గంగిరెద్దులతో తిరుగుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో వైద్యాధికారులు

పిచ్చాటూరు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారులు, సిబ్బంది సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డాక్టర్ గాయత్రి, డాక్టర్ హమీద్ సహా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు సాంప్రదాయ దుస్తులతో ఉదయం పీహెచ్‌సీకి వచ్చారు. భోగి మంటలు వేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని శుభ్రం చేసి, సంక్రాంతి ముగ్గులు వేసి, పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలు, చెరకు గడలతో పీహెచ్‌సీ గుమ్మాన్ని అలంకరించి సంక్రాంతి వాతావరణం ఉట్టిపడేలా చేశారు. ఆ తర్వాత పొంగళ్లు పెట్టి సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు.

నేడు పూడిలో సంక్రాంతి సంబరాలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని పూడిలో పూడి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉదయం బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో మామిడి మొక్కలు ప్రతి ఇంటికీ ఇస్తామన్నారు. కార్యక్రమానికి పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, మాజీ ఐఏఎస్ జి.బలరామయ్య, హాజరు అవుతారని, అలాగే రాత్రి ఏడు గంటలకు విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. అలాగే 16న గ్రామంలో పండరి భజన కోలాటం కోలాహలంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్రాంతి కోలాహలం


బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్రాంతి పండుగ నేపథ్యంలో శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలో దుకాణాలు కిక్కిరిశాయి. పూజాసామగ్రి, వివిధ రకాల సరుకుల కొనుగోళ్ల నిమిత్తం వచ్చిన మండల ప్రజలతో రద్దీగా కనిపించాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల పూజల కోసం కావలసిన వాటిని కొనుగోలు చేశారు.

క్లుప్తంగా

గ్రామ సచివాలయాల తనిఖీ


గ్రామ సచివాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దారు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు ఆదేశించారు. శుక్రవారం ఆయన బుచ్చినాయుడు కండ్రిగ, కాటూరు గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్పందనలో వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు వర్తించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ముక్కంటి సేవలో తెలంగాణ ఎమ్మెల్యే


గురుదక్షిణామూర్తి సన్నిధిలో తుంగదుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం తెలంగాణ రాష్ట్రం తుంగదుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. మొదట వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారుల సతీష్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధిలైట్లు వేశారు


అంజిమేడు పంచాయతీ కృష్ణగిరి కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రీషియన్

ఏర్పేడు: మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా శుక్రవారం వీధిలైట్లు వేశారు. అంజిమేడు, ఏర్పేడు, చిందేపల్లె, కందాడు, ముసలిపేడు, మేర్లపాక, మన్నసముద్రం, ఇసుకతాగేలి, పాతవీరాపురం, మాధవమాల తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు వీధిలైట్లు వేయించారు. కార్యక్రమంలో సర్పంచులు తాతేకాల్వ మోహన్‌రెడ్డి, గురవమ్మ, మంజుల, గంగాధరం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అశోక్ నగర్‌లో వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: స్థానిక అశోక్ నగర్‌లో శుక్రవారం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, ఏర్పేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో పలువురు జ్వరాల బారిన పడ్డారు. ఇది తెలుసుకున్న సర్పంచ్ వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. ఉచితంగా మందులు అందజేశారు. అలాగే గ్రామంలోని మురుగు కాలువలు, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ రాఘవరెడ్డి, సీహెచ్‌ఓ శివరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని రష్ ఆస్పత్రి (తిరుపతి) అధినేత సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని సరస్వతికండ్రిగ ఎస్టీ కాలనీలో యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రష్ అధినేత మాట్లాడారు.గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలన్నారు. తమవంతుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు మిక్సీ, రైస్‌కుక్కర్, గ్యాస్ స్టౌ, స్టీల్ క్యారియర్లను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, మాజీ సర్పంచ్ మైరావణ, న్యాయవాదులు తిరుమల రెడ్డి, నళినికుమారి, సుబ్రమణ్యం, యువనేస్తం అసోసియేషన్ ప్రతినిధులు హనుమంత్ నాయక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ


రైతులకు పురుగు మందులు అందజేస్తున్న శాస్త్రవేత్త సుధాకర్

ఏర్పేడు: మామిడి పూతలో తేనెమంచు పురుగు నివారణకు థయోమిథాక్సామ్ పిచికారీ చేయాలని రాస్ కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ సూచించారు. శుక్రవారం రేణిగుంట మండలంలోని కరంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మామిడి పూతలో ప్రస్తుతం తేనె మంచు పురుగు ఆశిస్తోందన్నారు. అనంతరం వివిధ రకాల పురుగు మందులను రైతులకు అందజేశారు.

గ్రామాలను కమ్మేస్తున్న పొగమంచు


మండలంలో మూడు రోజులుగా పొగ మంచు గ్రామాలను కమ్మేస్తోంది. ఉదయం 9 గంటలైనా పొగమంచు వీడటం లేదు. మరోవైపు దట్టంగా కురుస్తున్న పొగమంచు వలన పంటలకు తెగుళ్లు సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చలి తీవ్రతకు వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ

ఏఎంసీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ


తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి

నాయుడుపేట: నాయుడుపేట మార్కెటింగ్ కమిటీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఏఎంసీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులు, డైరెక్టర్లతో సమీక్షించారు. అధికారులు సమయ పాలన పాటించాలన్నారు. రైతులకు సత్వర సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ అధికారులు, సీఎస్‌డీటీ ఓబయ్య, డెరెక్టర్లు పట్టుకోట రఘు, సురేష్‌రెడ్డి, పేర్నాటి రాహుల్, బైనా మల్లికార్జున్ రెడ్డి, పేట చంద్రారెడ్డి, కటకం జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా జోన్‌లో చేరితే పథకాల ఫలాలు

చిట్టమూరు: మండలంలోని రొయ్యల రైతులు ఆక్వా జోన్‌లో చేరితే ప్రభుత్వ పథకాల ఫలాలు పొందవచ్చని షిషరీస్ అధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండలంలోని కోగిలి సచివాలయంలో ఆక్వా రైతులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆక్వా జోన్‌లో చేరితే వర్తించే ప్రభుత్వ పథకాలు, పొందే విద్యుత్ రాయితీల గురించి వారికి తెలియజేశారు. రొయ్యల రైతులు దీనిని సద్వినియోగం చేసుకునేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత షేక్ రెహ్మాన్, రొయ్యల రైతులు పాల్గొన్నారు.

మరణం అంచులకు వెళ్లి..!

- గుండెపోటుతో కుప్పకూలిన రైతు
- హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు
- రూ.40వేల విలువైన ఇంజెక్షన్ వేయడంతో బతికి బట్టకట్టాడు


కోలుకున్న వెంకటయ్యతో వైద్యసిబ్బంది

శ్రీకాళహస్తి: ఓ వ్యక్తి మరణం అంచుల వరకు వెళ్లి పునర్జీవితుడైన ఘటన శుక్రవారం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాలు..బుచ్చినాయుడుకండ్రిగ మండలం చిట్లవారి కండ్రిగకు చెందిన రైతు వై.వెంకటయ్య(65) ఉదయం ఇంటి వద్ద గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈసీజీ తీసిన వైద్యులు పరిస్థితిని పరిశీలించారు. మరణానికి దగ్గరగా ఉన్న వెంకటయ్యకు రూ.40వేల విలువైన ఇంజెక్షన్ వేశారు. దీంతో అర గంట తరువాత అతను కోలుకున్నాడు. కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స చేసిన డాక్టర్ ప్రవీణ్, స్టాఫ్ నర్సును పలువురు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

రాపూరు: రాపూరులో జిల్లా స్థాయిలో జరిగే గ్రిగ్ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. 98వ గ్రిగ్ మెమోరియల్ టోర్నమెంట్‌లో భాగంగా సెకండరీ స్కూల్స్ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను రాపూరు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయని, 15,16,17 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం భూమిని పంపిణీ చేయనుందని తెలిపారు. ఎంపీపీ చెన్ను బాలకష్ణా రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చెన్ను తిరుపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రా రెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్‌రాజు, ఎంపీడీఓ అమోస్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడి

సత్యవేడు: రబీలో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకునేలా వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కే. శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. శుక్రవారం వ్యవసాయ సలహా సంఘం సమావేశం వ్యవసాయ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఓసీలుగా ఉన్న రైతు కూలీలకు కౌలు రైతు కార్డులను ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. మండలంలో 50శాతం రైతులు మాత్రమే పంట నమోదు చేయించారని తెలిపారు. వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ, పీఎం కిసాన్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్‌ను రైతు భరోసా కేంద్రాల్లో చేస్తున్నట్లు చెప్పారు. పంట నమోదు చేయించడం వల్ల రైతులకు సున్నావడ్డీ, పంట నష్టపరిహారం, పంట కొనుగోలు సక్రమంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు దినేష్ రెడ్డి, రవిరెడ్డి, మునెయ్య రెడ్డి, సుబ్రమణ్యం, అగ్రికల్చర్ అసిస్టెంట్ మదన్, స్వర్ణ పాల్గొన్నారు.

జలిజ ఉద్యోగుల అభ్యుదయ సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని వరదరాజస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సంఘం నూతన క్యాలెండర్లు, డైరీలను పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆవిష్కరించారు. బలిజ ఉద్యోగుల యూనియన్‌కు తన వంతు సహకారం ఇస్తామన్నారు. బలిజ ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు అశోక్‌కుమార్, నీలం నరేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో బాలిశెట్టి ప్రభురెడ్డి, ముత్యాల రవికుమార్, లక్ష్మీప్రసాద్, తోట లక్ష్మీనారాయణ, పూల సురేష్, ప్రసాద్, మోహన్, జయప్రకాష్, వంశీకృష్ణ, లక్ష్మీనారాయణ, బాలగున్నయ్య, ఆనంద్‌కుమార్, సూర్యప్రకాష్, రమణ, జనార్దన్, హేమంత్‌కుమార్, స్వర్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ బాలాజీనాయక్ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి నాయకులు చింతా రవి, పి.గురవయ్య, సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, శివకుమార్, రొద్ద గోపి పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని సాంబయ్యపాళెంలో డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, దోమల వలన వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్లు కామరాజు, భారతి దోమల లార్వాలను చూపించి, వాటిని నిర్మూలించే కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, పీహెచ్ఎన్ సంపూర్ణ, ఏఎన్ఎం ఇందిర, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ‘కొక్కొరొక్కో’



సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ శనివారం రాత్రి కోడిపుంజుల కొక్కొరొక్కో కూతలు పాదచారులను ఆకర్షించాయి. అవేం కూశాయంటే... మండలంలోని మంగళపాడు గ్రామ అటవీ ప్రాంతాల్లో కోడి పందాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో శనివారం సాయంత్రం ఎస్ఐ రవిబాబు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దీంతో కొందరు పిక్కబలం చూపి పరుగో..పరుగు..! పోలీసులు వెంటాడి కోడిపుంజులతో సహా నలుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2200 స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో సహా పుంజులను పోలీస్‌స్టేషన్‌కు తేవడంతో అవి కూతలేస్తూ పందాల యవ్వారాన్ని చెప్పకనే చెప్పాయి. అవి పదే పదే కూతలేస్తూండడంతో వాటిని స్థానికంగా నాటుకోళ్ల పెంపకందారుల వద్దకు తరలించారు.

హిందూ శ్మశానవాటిక రోడ్డుకు రూ.20లక్షలు

- తిరుపతి ఎంపీ గురుమూర్తి హామీ


హిందూ శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎంపీ మద్దెల గురుమూర్తి

నాయుడుపేట: నాయుడుపేట హిందూ శ్మశానవాటిక రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి హామీ ఇచ్చారు. శుక్రవారం స్థానిక హిందూ శ్మశానవాటికను ఎంపీ సందర్శించారు. రోడ్డు, ఇరువైపులా పూలమొక్కల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. నిధుల మంజూరు విషయమై స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కిషోర్‌రెడ్డి, చదలవాడ కుమార్, విశ్రాంత ఉద్యోగులు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిశీలన


హిందూ శ్మశాన వాటికను పరిశీలిస్తున్న దేవసేనమ్మ తదితరులు

గూడూరు: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ అన్నారు. శుక్రవారం జనార్దన్‌రెడ్డి కాలనీ ప్రాంతంలోని హిందూ శ్మశానవాటికను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, శ్మశానాన్ని శుభ్రం చేయించినట్లే డంపింగ్ యార్డును కూడా రోడ్డు మార్జిన్‌కు దూరంగా ఉండేలా శుభ్రంగా చేయాలని కమిషనర్ సాయినాథ్‌కు సూచించారు. పట్టణ ప్రజలంతా ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సురేష్‌రెడ్డి, కోదండరామయ్య, శ్రీనివాసులు, సాయి తదితరులు పాల్గొన్నారు.